

ఉత్పత్తులను పరిశీలిస్తున్న
ఆంధ్రప్రదేశ్ హ్యాండ్లూమ్ కమిషనర్ రేఖా రాణి, రేణుదేశాయ్

ఏపీ హ్యాండ్లూమ్ ఆధ్వర్యంలో సేవ్ ది వీవ్ చేనేత ప్రదర్శన

బంజారాహిల్స్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ చేనేత, జౌళి శాఖ, రూమ్9 సహకారంతో జూబ్లీహిల్స్ రోడ్ నంబర్-41లో ని రూమ్9 పాప్ అప్ స్టోర్‌లో ఏర్పాటు చేసినసేవ్ ది వీవ్ 6 రోజుల చేనేత వస్త్ర ప్రదర్శనను ఆంధ్రప్రదేశ్ టెక్స్‌టైల్స్- హ్యాండ్లూమ్ కమిషనర్ రేఖా రాణి, శ్రీ ఆద్య యానిమల్ షెల్టర్ వ్యవస్థాపకురాలు, నటి రేణు దేశాయ్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రేఖారాణి మాట్లాడుతూ చేనేత కార్మికుల అభ్యున్నతికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. రేణు దేశాయ్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో చేనేతకు ప్రత్యేక స్థానం ఉందని, నేటి యువత బాధ్యతగా చేనేతను ఆదరించి, ప్రోత్సహించాలన్నారు. రూమ్9, సెలెబ్రిటీ సీక్రెట్స్ ఫౌండర్ డాక్టర్ మాధవి చౌదరి మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీ కొనసాగుతున్న ప్రదర్శనలో ఆంధ్రప్రదేశ్‌లోని అనేక జిల్లాల నుంచి ఇక్కడ హ్యాండ్ లూమ్, పట్టు, కాటన్, డ్రెస్ మేటీరియల్స్, హ్యాండీక్రాఫ్ట్స్ వంటి వేలాది రకాల వస్త్రోత్పత్తులు అందుబాటులో ఉంచారని వివరించారు. కార్యక్రమంలో పద్మశ్రీ అవార్డు పద్మజా రెడ్డి, సామాజిక వేత్త విలేఖ బోయపాటి, నటి ప్రగతి మహావాది, కాలా తాటికొండ, డా. నిర్లేపా క్రొవ్విడి ఐఏఎస్ అకాడమీ వ్యవస్థాపకురాలు బాల లత మల్లవరపు, తెలంగాణ అదనపు కార్మిక కమిషనర్ డాక్టర్ ఈ.గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



సీసీ కెమెరాలు ప్రారంభిస్తున్న నార్త్‌జోన్ డీసీపీ రష్మీ పెరుమాళ్

కాలనీ భద్రతకు సీసీ కెమెరాలు కీలకం

● డీసీపీ రష్మీ పెరుమాళ్

బేగంపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాలనీల భద్రతకు సీసీ కెమెరాల ఏర్పాటు ఎంతో ముఖ్యమని నార్త్‌జోన్ డీసీపీ రష్మీ పెరుమాళ్ అన్నారు. బేగంపేటలోని మోతీలాల్ నెహ్రూనగర్, ఎస్‌బీఐకాలనీలలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను డీసీపీ రష్మీ పెరుమాళ్ గురువారం ప్రారంభించారు. కాలనీల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 27 కెమెరాలతో పాటు వ్యక్తిగతంగా ఏర్పాటు చేసిన 22 కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి బస్తీ, కాలనీల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. భద్రతకు ఇవి ఎంతో కీలకమన్నారు. కార్యక్రమంలో ఏసీపీ గోపాలకృష్ణమూర్తి, ఇన్‌స్పెక్టర్ రామయ్య, కాలనీ ప్రతినిధులు విశాల్ సుధాం, రవీంద్ర జయశ్రీ, తదితరుల పాల్గొన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న చిన్మయ మిషన్ ప్రతినిధులు రామచంద్రమూర్తి, రవీంద్రనాథ్

రేపు స్వామి స్వరూపానంద ప్రవచనాలు

బేగంపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): భారతీయ విద్యాభవన్‌లో శనివారం జరిగే ప్రవచనాలకు చిన్మయ మిషన్ గ్లోబల్ హెడ్ స్వామి స్వరూపానంద ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రవచనాలను వినిపించనున్నట్లు చిన్మయ మిషన్ ప్రతినిదులు రామచంద్రమూర్తి, రవీంద్రనాథ్, శివ తెలిపారు. గురువారం బేగంపేటలోని చిన్మయ మిషన్‌లో ఏర్పాటు చేసిన, విలేకరుల సమావేశంలో దీనికి సంబందించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతీయ విద్యాభవన్‌లో శనివారం సాయంత్రం 6.30 గంటల నుంచి 8 గంటల వరకు స్వామి స్వరూపానంద ప్రవచనాలు చెబుతారని తెలిపారు. ఆధ్యాత్మికంతో పాటు అనంత విజయము, ఆదర్శమైన ఉన్నత విలువలు తదితర విషయాలపై ప్రవచనాలను వినిపిస్తారన్నారు.



యువజన కాంగ్రెస్‌కు జరిగిన ఎన్నికల్లో ఖైరతాబాద్ నియోజకవర్గం, ఖైరతాబాద్ డివిజన్ల అధ్యక్షులుగా ఎన్నికైన వినోద్‌నాయక్, ఎర్ర సతీష్‌లతో పాటు పలు డివిజన్ల అధ్యక్షులను సత్కరించి శుభాకాంక్షలు తెలుపుతున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి విజయారెడ్డి -ఖైరతాబాద్, ఆంధ్రజ్యోతి



ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేసిన నిందితులు, స్వాధీనం చేసుకున్న కారు

ఒడిశా నుంచి నగరానికి హ్యాష్ ఆయిల్

● పట్టుకున్న ఎక్సైజ్ పోలీసులు ● ఇద్దరు నిందితుల అరెస్టు
● రూ. 5 లక్షల విలువైన సరుకు, కారు స్వాధీనం

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఒడిషా నుంచి హైదరాబాద్‌కు హ్యాష్ ఆయిల్‌ను గుట్టుగా సరఫరా చేస్తున్న నిందితున్ని ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. అతని వద్ద నుంచి రూ. 5 లక్షల విలువైన 1.5 కేజీల హాష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటకు చెందిన కొండె మల్లికార్జున్, హైదరాబాద్‌కు చెందిన మహ్మద్ రహమాన్ ఖాన్ ఒడిశాలో హ్యాష్ ఆయిల్‌ను కొనుగోలు చేసి హైదరాబాద్‌కు సరఫరా చేస్తున్నారు. డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతున్న ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ టీమ్ పోలీసులు నిందితుల కదలికలపై నిఘా పెట్టారు. గురువారం తెలిసిన విశ్వసనీయ సమాచారం మేరకు చందానగర్ రైల్వేస్టేషన్ సమీపంలో దాడిచేసి కారులో తరలిస్తున్న హ్యాష్ ఆయిల్‌ను, కారును స్వాధీనం చేసుకొని ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్‌టీఎఫ్ టీమ్ సీఐ చంద్రశేఖర్ తెలిపారు. ఇదే టీమ్ పురాణాపూల్ ప్రాంతంలో గంజాయి విక్రయాలు జరుగుతున్నాయనే సమాచారం మేరకు దాడిచేసి 1.1 కేజీల గంజాయిని పట్టుకున్నట్లు తెలిపారు.

నిబంధనలా.. మాకేం పట్టవు!

● ఫ్రీ లెఫ్ట్‌కు అడ్డుగా వాహన చోదకులు ● ట్రాఫిక్ పోలీసుల సూచనలను బేఖాతర్
● వెనుక వస్తున్న వాహనదారులకు ఇబ్బందులు ● హిల్స్‌లో పెరుగుతున్న ట్రాఫిక్ కష్టాలు



పోలీసులతో వాగ్వాదానికి దిగుతున్న వాహన చోదకులు

బంజారాహిల్స్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): "ఎన్‌టీఆర్ ట్రస్టు భవన్ వద్ద ఓ ఖరీదైన కారు సిగ్నల్ జంప్ చేసింది. అక్కడే ఉన్న పోలీసులు పసిగట్టి వెనక్కి వెళ్లాలంటూ సూచించారు. కారులో ఉన్నయజమాని వినిపించుకోలేదు. ట్రాఫిక్ కానిస్టేబుల్ స్వరం పెంచి హెచ్చరించాడు. దీంతో కారులో ఉన్న వ్యక్తి కావాలంటే ఫైన్ వేసుకో నేను మాత్రం వెనక్కి వెళ్లేది లేదని నిర్లక్ష్యంగా సమాదానం ఇచ్చాడు"

"బంజారాహిల్స్ క్యాన్సర్ ఆస్పత్రి నుంచి బంజారాహిల్స్ రోడ్డు నంబరు-2 వైపు వెళుతున్న ఓ కారు కేబీఆర్ పార్కు సిగ్నల్ వద్ద ఆగింది. నిబంధనలకు విరుద్ధంగా ఫ్రీ లెఫ్ట్ ఆటంకం కలిగించేలా నిలిచింది. కానిస్టేబుల్ ఉమామహేశ్వరరావు ఆ కారు ఫోటో తీసి ఫ్రీ లెఫ్ట్ అడ్డు తొలగించాలని కోరాడు. కారులో ఉన్న యువకుడు ఫొటో తీశావు కదా తీయను అంటూ చెప్పాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం పెరిగింది. కారు దిగిన యువకుడు ఉమామహేశ్వరరావు పై దాడి చేశాడు"

వాహన చోదకులు క్రమశిక్షణ తప్పుతున్నారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తున్నారు. అంతేకాదు ట్రాఫిక్ పోలీసుల హెచ్చరికలను సైతం పెడచెవిన పడుతున్నారు. ఫలితంగా హిల్స్‌లో ట్రాఫిక్ కష్టాలు పెరిగిపోతున్నాయి. అసలే వాహనాల సంఖ్య పెరిగి ట్రాఫిక్‌కు ఆటంకాలు ఏర్పడుతుండగా కొంత మంది వాహన చోదకులు చేస్తున్న వితండవాదం మరిన్ని ట్రాఫిక్ ఇబ్బందులు తెచ్చి పెడుతున్నాయి. ముఖ్యంగా బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ ప్రాంతంలో ప్రధాన కూడళ్ల వద్ద వాహన చోదకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తుండటం తలనొప్పి వ్యవహారంగా మారింది.

ఫ్రీ లెఫ్ట్‌లో సాఫీగా వెళ్లేలా..

బంజారాహిల్స్‌లో కేబీఆర్ పార్కు, జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు నుంచి ప్రతి నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం సమయాల్లో కూడళ్ల వద్ద ట్రాఫిక్ కష్టాలు ఎక్కువ అవుతుండటంతో ట్రాఫిక్ పోలీసులు అందుకు గల కారణాలను అన్వేషించడం మొదలు పెట్టారు. ఇందులో భాగంగా అక్రమ పార్కింగ్‌లపై చర్యలు తీసుకున్నారు. రోడ్డు నంబరు-2కు వెళ్లే వాహనదారులు ఫ్రీ లెఫ్ట్‌ను అడ్డగిస్తూ వాహనాలు నిలుపుతున్నారు. ఫలితంగా వెనుకాల ఉన్న వాహనాలను బ్రేకులు పడుతున్నాయి. దీంతో సిగ్నల్స్ వద్ద ఒత్తిడి పెరిగిపోతుంది. జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వద్ద కూడా ఇదే పరిస్థితి ఉండేది. అయితే ఉన్న ట్రాఫిక్ ఒత్తిడికి ఫ్రీ లెఫ్ట్ అమలు చేయడంతో మరిన్ని ఇబ్బందులు తలెత్తుతాయని భావించిన ట్రాఫిక్ పోలీసులు ఫ్రీ లెఫ్ట్‌ను తొలగించారు.

జంక్షన్ లెస్ చౌరస్తాలపై అధ్యయనం

జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు లాంటి పెద్ద జంక్షన్‌లలో తరుచూ ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటుంది. వాహన చోదకులు సిగ్నల్ కోసం కనీసం పది నుంచి పదిహేను నిమిషాలు వేచి చూడాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో జంక్షన్ లెస్ చౌరస్తాల అభివృద్ధిపై పోలీసులు దృష్టి సారించారు. ఇందుకోసం పూర్తి స్థాయిలో అధ్యయనం చేస్తున్నారు. చౌరస్తా లేకుండా వాహనాలు నేరుగా వెళ్లి యూటర్న్ తీసుకునే లాగా ఏర్పాట్లు చేయాలని అనుకుంటున్నారు. ఎక్కువగా ఉన్న యూటర్న్‌లను కూడా తొలగించాలని నిశ్చయించారు. ఇప్పటికే ఫిలింనగర్ రోడ్డులో దాదాపు ఆరు యూ టర్న్‌లు ఉండగా ఇప్పుడు వాటిని రెండుకు కుదిరించారు. దీంతో ట్రాఫిక్ జాం తగ్గిందని పోలీసులు అంటున్నారు. కృష్ణానగర్‌లో ఇదే ప్రయోగం చేశారు. ఇక్కడ మంచి ఫలితాలు వచ్చాయి.

వాగ్వాదాలతో తలనొప్పి

ఇటీవలె హిల్స్‌లో ట్రాఫిక్ సమస్య దృశ్య పోలీసులతో పాటు శిక్షణ తీసుకున్న హైడ్రా సిబ్బంది కూడా వాహనాల క్రమబద్ధీకరణకు తోడ్పాటును అందిస్తున్నారు. అయితే జంక్షన్‌ల వద్ద వీరు ట్రాఫిక్‌కు ఆటంకాలు కలిగించేలా వారికి హైడ్రా సిబ్బంది సూచనలు అందచేస్తున్నా చోదకులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఫలితంగా ట్రాఫిక్ పోలీసులు కలుగ చేసుకోవాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో పలువులు వాగ్వావాదాలకు దిగడం దాడులు చేయడం తలనొప్పి వ్యవహారంగా మారింది. ఇలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నప్పటికి పరిస్థితి ఇలాగే కొనసాగితే మిగతా వాహన చోదకులు ఇబ్బందులు తలెత్తాయని పోలీసులు భావిస్తున్నారు. ఇక మీదట కఠినంగా వ్యవహరించాలని భావిస్తున్నారు.

వాహనచోదకులు క్రమశిక్షణ పాటించాలి



ట్రాఫిక్ సమస్య తగ్గించాలనే ఉద్దేశ్యంతో పోలీసులు నిరంతరం శ్రమిస్తున్నారు. ఎవరికి ఎటువంటి ఇబ్బంది కలుగకుండా ఉండేలా అనేక మార్లు అధ్యయనం చేసిన తరువాతే నిబంధనలు పెడతాం. వాటిని వాహన చోదకులు క్రమశిక్షణతో పాటించాలి. అప్పుడు వాహనాల రాకపోకలు సజావుగా సాగుతాయి. కాని కొందరు ఫ్రీ లెఫ్ట్‌ను బ్లాక్ చేసి ఇబ్బందులు పెరుగుతున్నాయి. పోలీసులపై దురుసుగా ప్రవర్తిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

-కట్టా హరిప్రసాద్, పశ్చిమ మండలం ట్రాఫిక్ ఏసీపీ

కమలానగర్ వాసుల కలనెరవేరింది



లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందిస్తున్న మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, మేయర్ గద్వాల విజయలక్ష్మి, కార్పొరేటర్ సీఎన్ రెడ్డి



లబ్ధిదారులకు ఇళ్ల పటాలు అందజేస్తేన్న కార్పొరేటర్ బాబా

● ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

యూసుఫ్‌గూడ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఏన్నో సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న వాళ్ల డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఎట్టకేలకు వారికి వచ్చాయి. దీంతో వారి ఆనందానికి అవధులు లేకుండా ఉత్సాహంతో కేరింతలు కొట్టారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి తమ సంతోషాన్ని వెళ్లబుచ్చారు. రహ్మత్‌నగర్ డివిజన్ కమలానగర్‌లో డుబుల్ బెడ్‌రూమ్ లబ్ధిదారులకు కొందరికి గతంలో ఇళ్లు కేటాయించారు. మరో 44 మందికి కేటాయించలేదు. దీంతో వారు మా ఇళ్లు ఎప్పుడు ఇస్తారు అంటూ అధికారుల చుట్టూ ప్రజా ప్రతినిధుల చుట్టూ చెప్పులరిగేలా తిరిగారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత కార్పొరేటర్ సీఎన్ రెడ్డి ఈ విషయంపై ప్రత్యేక శ్రద్ధతీసుకుని మంత్రుల దృష్టకి తీసుకువెళ్లి, ఉన్నతాధికారులతో సంప్రదించారు. ఎట్టకేలకు కమలానగర్ లబ్ధిదారులకు గురువారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆధ్వర్యంలో రెవెన్యూ హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, మేయర్ గద్వాల విజయలక్ష్మి చేతుల మీదుగా లబ్ధిదారులకు ఇళ్లు కేటాయింపు ధ్రువపత్రాలు అందించారు. తమకు న్యాయం చేసి నందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి మిఠాయిలు పంచుకున్నారు.

అర్హులందరికి ఇందిరమ్మ ఇల్లు..

బోరబండ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అందజేసిన పట్టాల పంపిణీ కార్యక్రమంలో బోరబండ చెందిన వివిధ పథకాల లబ్ధిదారులు ఇందిరమ్మ(డబుల్ బెడ్ రూమ్) ఇల్లు-44 మంది, కల్యాణ లక్ష్మి-80 మంది, షాదీ ముబారక్-83 మందికి వారు అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ బాబా మాట్లాడుతు డిసెంబరు 10 తరువాత ఇందరమ్మ ఇల్లు అందించడానికి ప్రభుత్వం రూపకల్పన చేసిందన్నారు.

ఉద్యమకారులను బీఆర్ఎస్ విస్మరించింది

పంజాగుట్ట, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ తెలంగాణ ఉనికి లేకుండా చేసే ప్రయత్నం చేశారని తెలంగాణ అమరుల ఆశయాల సాధన జేఏసీ చైర్మన్, టీపీసీసీ అధికారప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయం ఆరోపించారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జేఏసీ నాయకులు, అమరవీరుల కుటుంబ సభ్యులతో కలిసి ఆయన మాట్లాడారు.గత ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులను విస్మరించిందని ఆయన అన్నారు.

నిలోఫర్ ఆస్పత్రిలో

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నిలోఫర్ ఆస్పత్రిలో ప్రజాపాలన విజయోత్సవాలను గురువారం నిర్వహించారు. ఆస్పత్రి ప్రధాన ప్రాంగణం పరిధిలో జాతీయ జెండాలోని రంగుల ప్రత్యేక లైటింగ్‌తో అలంకరించి ముస్తాబు చేశారు. రూ. 20 లక్షల తో ఏరాటు చేసిన లాండ్రీని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్ రవికుమార్ ప్రారంభించారు.



బహిరంగ సభలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచందరరావు

ప్రజలను మోసం చేసి విజయోత్సవాలా?

● వచ్చే ఎన్నికల్లో బీజేపీదే పీఠం: రామచందర్‌రావు

యూసుఫ్‌గూడ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఏడాది పాలనలో ప్రజలకు చెప్పిన హామీలు నెరవేర్చకపోగా విజయోత్సవాలు జరుపుకుంటున్నారని, ఈ ఏడాదిలో రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు ఏ ఒక్క వర్గం ప్రజలకు చేసింది ఏమీ చేయలేని కాంగ్రెస్‌కు ఉత్సవాలు జరుపుకునే నైతిక హక్కు లేదని బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచందర్‌రావు అన్నారు. గురువారం రహ్మత్ నగర్ డివిజన్ కార్మికనగర్ ఆటో స్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పాలనలో అమలు కానీ గ్యారంటీలపై బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా వచ్చిన ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీవి అన్నీ అబద్దాలు రాజకీయాలు, కుంబకోణాల రాజకీయాలు, ఒకే కుటుంబ రాజకీయం చేస్తూ వారికి కావాల్సిన కొద్ది మందిని బాగుచేసుకునే రాజకీయాలు చేయటం పరిపాటి అన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణాలో కూడా బీజేపీ జెండా ఎగరడం ఖాయమన్నారు. జూబ్లీహిల్స్ నియోజక కన్వీనర్ కుంబాల గంగరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ ఇన్‌చార్జి లంకల దీపక్‌రెడ్డి, డి.ప్రేమ్‌కుమార్, అనంతలక్ష్మి, కొలను సత్యనారాయణ, సుప్రియగౌడ్, జ్ఞానేశ్వర్, పులిరామ్, బడుగు సతీష్, చంద్రమోహన్, వెంకటేష్, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.



ఖైరతాబాద్‌లో జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతున్న బీజేప రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

హామీలను అమలు చేయండి

● బీజేపీ బహిరంగ సభలో చింతల రామచంద్రారెడ్డి

ఖైరతాబాద్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): చేతగాని తనానికి జాతకాన్ని నిందించినట్లు ముఖ్యమంత్రి ఆయన ఇచ్చిన హామీలు నెరవేర్చలేక ఇతరులను నిందిస్తున్నాడని బీజేప రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆరోపించారు. బీజేపీ ఖైరతాబాద్ నియోజకవర్గం ఆధ్వర్యంలో కాంగ్రెస్ గ్యారంటీల గారడీ-6 అబద్దాలు.. 66 మోసాలు అంటూ కాంగ్రెస్ ఏడాది పాలన వైఫల్యాలంటూ ఖైరతాబాద్ భారీ గణపతి వేదిక వద్ద నిర్వహించిన బహిరంగ సభలో ఆయన బిజెపి నాయకులతో కలసి పాల్గొని ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీ 70 సంవత్సరాల పాలనలో విదేశాల్లో తాకట్టు పెట్టిన బంగారాన్ని విడిపించి తెచ్చేందుకు ప్రధాని మోడీ కృషి చేస్తున్నారన్నారు. ఎన్నో పథకాలను అమలు చేస్తామంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ వాటి అమలును పట్టించుకోకుండా ఇతర పార్టీలపై ఆరోపణలు చేస్తున్నారన్నారు బీజేపీ పేదల కోసం కుల మతాలకు అతీతంగా పనిచేసే పార్టీ అని మోడీ ఇస్తున్న సంక్షేమ ఫలాలను అన్ని కులాలు, మతాల వారు అనుభవిస్తున్నారని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి త్వరలో మరో ఏక్‌నాథ్ షిండే అవనున్నారని జోస్యం చెప్పారు. ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం గడుస్తున్నా, ఒక్క రేషన్‌కార్డు ఇవ్వకుండా విజయోత్సవాలు జరుపుతుండడం హేయమైన చర్యగా పేర్కొన్నారు. సభలో బీజేపీ రాష్ట్ర నాయకురాలు బంగారు శృతి, నాయకులు మేచినేని శ్రీనివాసరావు, బద్దం మహిపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ప్రేంరాజ్, ఎన్‌డి నగేష్, రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ అస్తిత్వంపై సీఎం దాడి

● తెలంగాణ తల్లి రూపం మార్చే ప్రయత్నం చేస్తే ఊరుకోం

పంజాగుట్ట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ అస్తిత్వంపై దాడి చేస్తున్నారని, తెలంగాణ తల్లి రూపం మార్చే ప్రయత్నం చేస్తున్నారని రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్ ఆరోపించారు. తెలంగాణ తల్లి కిరీటం, బతుకమ్మ తీసేస్తామని అనడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు సీహెచ్.ఉపేంద్ర, ఎస్సీ కమిషన్ మాజీ సభ్యులు చిలకమర్తి నరసింహ, విద్యాసాగర్‌లతో కలిసి మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ అస్తిత్వంపై దాడి చేసి నాశనం చేసే ప్రయత్నం చేస్తున్నాడని, దీనిలో భాగంగానే తెలంగాణ తల్లి రూపాన్ని మార్చే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. సమైక్యవాదుల కనుసన్నల్లో ప్రజాపాలన చేస్తున్న సీఎం తెలంగాణ అస్తిత్వంపై జరిపే దాడిని ఖండిస్తున్నామని అన్నారు. మూడు కోట్లకు పైగా ఉన్న తెలంగాణ ప్రజల ఆకాంక్షలు,అస్తిత్వానికి ప్రతి రూపమే తెలంగాణ తల్లి అన్నారు. తెలంగాణ ఉద్యమం నుంచి పుట్టిందే తెలంగాణ తల్లి అన్నారు. తెలంగాణ తల్లి రూపం మార్చే ప్రతిపాదనను వెంటనే విరమించుకోవాలన్నారు. తెలంగాణలో సమృద్ధిగా పండే పంటలు, బతుకమ్మ, పట్టు వస్త్రాలు ధరించి వైభవంగా చూపాలని ఆలోచన చేశారు. రూపాన్ని మార్చేస్తే మాత్రం ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు.

క్యాబినెట్ మంత్రులకు కూడా తెలియకుండా రహస్యంగా విగ్రహం తయారు చేయిస్తున్నారని, ఎందుకీ రహస్యం అన్నారు. తెలంగాణ తల్లి రూపం తెచ్చిన సమయంలో ప్రొఫెసర్ కోదండరామ్ కూడా ఉన్నారు. ఇప్పుడు మారుస్తామని చెప్తే ఎలా. కాకతీయ తోరణం, చార్మినార్ కూడా తీసేస్తామని అంటున్నారు. రూపం ఎందుకు మార్చే ప్రయత్నం చేస్తున్నారు. విగ్రహం రూపం మారుస్తుంటే కోదండరామ్ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. చరిత్ర మీద అవగాహన లేకనే రేవంత్ రెడ్డి అనవసరపు రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు.



గతంలో రూపొందించిన తెలంగాణ తల్లి, భారత మాత నమూనా చిత్రాలను ప్రదర్శిస్తున్న రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యులు

ఆహార ఉత్పత్తిలో పెరుగుతున్న రసాయనికీకరణ

● పబ్లిక్ పాలసీ విశ్లేషకుడు నర్సింహా రెడ్డి

అమీర్‌పేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలో ఆహార ఉత్పత్తిలో రసాయనికీకరణ పెరుగుతోందని పబ్లిక్ పాలసీ విశ్లేషకుడు డాక్టర్ నర్సింహా రెడ్డి విచారం వ్యక్తం చేవారు. అత్యంత ప్రమాదకరమైన పురుగుమందులు, కలుపు సంహారకాల ప్రతికూల ప్రభావాలపై జాతీయ సింపోజియం అమీర్‌పేటలోని సెస్ ఆడిటోరియంలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం అంతటా ప్రమాదకరమైన పురుగుమందులను పిచికారీ చేయడం వల్ల గ్రామీణ కుటుంబాలు బలహీణపడుతున్నాయన్నారు. ప్రతి పంట సీజన్‌లో భోపాల్ గ్యాస్ ట్రాజెడి మాదిరిగా ప్రతి గ్రామం గ్యాస్ చాంబర్‌గా మారీ గ్రామీణ పరిసరాలు దయనీయమైన స్థితిలో ఉన్నయని పేర్కొన్నారు. అనంతరం పాన్ ఇండియా సీఈఓ మాట్లాడుతూ దేశంలో అత్యధికంగా ఎగుమతి చేయబడిన, దిగుమతి చేసుకున్న పురుగుమందులలో ఎచ్‌ఎచ్‌పీలు ఉన్నాయని భారతదేశంలో నమోదు చేయబడిన ఈ హెచ్‌హెచ్‌పీలను చాలా వరకు భద్రత కోసం సరిగా అధ్యయనం చేయలేదని ఎందుకంటే అవి క్రిమిసంహారక చట్టం 1968 అమలులోకి రావడానికి ముందు వాడుకలో ఉన్నాయన్నారు. ప్రముఖ పర్యావరణ వేత్త ప్రొఫెసర్ పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ హెచ్‌హెచ్‌పీలపై నిషేధాన్ని సమర్థించడంలో ప్రచారకులు ప్రయత్నాల్లో ఉండాలని వైద్య సోదరులకు ఉద్బోధించారు. పాన్ ఇండియా నుంచి హీరా సీకే, రోష్నీలు కలుపు సంహారకాలపై తమ పరిశోధన ఫలితాలను సమర్పించారు. మన ఆహారం, గాలి, నీరు, నేల విషపూరిత వ్యవసాయ రసాయనలతో కలుషితమైందని పరిశోధనలో వెల్లడించారు. జీవవైవిధ్యాన్ని పురుగుమందుల ప్రతికూల ప్రభావాల నుండి రక్షించడానికి దేశంలో అత్యంత ప్రమాదకరమైన పురుగుమందులు, కలుపు సంహారకాలను నిషేధించాల్సిన తక్షణ అవసరాన్ని ఈ సింపోజియం డిమాండ్ చేసింది. కార్యక్రమంలో రెండు నివేదికలను విడుదల చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహా రెడ్డి దొంతి




క్రికెట్ టోర్నమెంట్ కప్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్, కార్పొరేటర్ వనం సంగీతాయాదవ్

యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్

బంజారాహిల్స్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ గురువారం ప్రారంభమైంది. అమీర్‌పేట దరమ్ కరమ్ రోడ్డులో ఉన్న గురుగోవింద్ ఆడిటోరియంలో ఈ టోర్నమెంట్ కప్‌ను ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానంనాగేందర్, కార్పొరేటర్ వనం సంగీతా యాదవ్ టోర్నమెంట్ కప్‌ను ఆవిష్కరించి పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దానం మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అన్నిచర్యలు తీసుకుంటుందన్నారు. యువత విద్యతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నిర్వాహకులు కిరణ్‌యాదవ్, కుందన్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహా, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | ఎం.డి. రఫీక్ : 99854 00084, జి.అంజయ్య: 9985921364

పిల్లర్లు.. స్లాబుతోనే..



మధ్యలోనే ఆగిపోయిన అడ్డగుట్ట మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్ పనులు

- నాలుగేళ్ల కిత్రం మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్ పనులకు శంకుస్థాపన
- పూర్తి చేయాలంటున్న అడ్డగుట్ట ప్రజలు

అర్ధాంతరంగా నిలిపివేసిన పనులు



2020లో శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే పద్మారావు (ఫైల్)

అడ్డగుట్ట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అడ్డగుట్ట డివిజన్‌లో శిథిలావస్థకు చేరిన కమ్యూనిటీహాల్‌ను నాలుగేళ్ల క్రితం కూల్చివేశారు. ఆధునిక హంగులతో దాదాపు రూ.2.25 కోట్లతో నిర్మించనున్న మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్ పనులకు గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి స్పీకర్, సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్, మాజీ కార్పొరేటర్ విజయకుమారితో కలిసి 2020, డిసెంబరులో శంకుస్థాపన చేశారు. పిల్లర్లు నిర్మించి, పైన స్లాబు వేశారు. అనంతరం పనులను అర్ధాంతరంగా నిలిపివేశారు. దాంతో ఫంక్షన్లు, శుభకార్యాలు జరుపుకోవడానికి అడ్డగుట్ట డివిజన్ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి వేగంగా పూర్తి చేయాలని కోరుతున్నారు. పాత కమ్యూనిటీహాల్‌ను నేలమట్టం చేసి ఆధునిక హంగులతో కడుతున్నామంటూ పిల్లర్లు వేసి విడిచిపెట్టారు. పాత కమ్యూనిటీహాలు బాగాలేకపోయినా చిన్నచిన్న మరమ్మతులు చేసుకుని శుభకార్యాలు జరుపుకునే వాళ్లమని స్థానికులు వాపోయారు. రాత్రి వేళ అక్కడ అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని, అటువైపునకు వెళ్లాలంటేనే భయమేస్తున్నదని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్ పనులకు శంకుస్థాపన చేసిన ప్రజాప్రతినిధులు చేతులు దులుపుకున్నారని మండిపడుతున్నారు. డివిజన్‌లో ని సమస్యలపై కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి పట్టించుకోవడం లేదని విమర్శించారు. డివిజన్‌లోని బస్తీల అభివృద్ధికి కృషి చేయని కార్పొరేటర్, ఎమ్మెల్యేను తిరుగనివ్వబోమని అన్నారు. నెల రోజుల్లో పనులను ప్రారంభించకపోతే ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని వారు హెచ్చరించారు.

ఇంకెన్నాళ్లకు పూర్తి చేస్తారో తెలియదు



పాత కమ్యూనిటీహాల్‌ను నేలమట్టం చేసి నాలుగేళ్లు అవుతుంది. టీడీపీ హయాంలో అప్పటి ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ స్థానికులు ఫంక్షన్లు, శుభకార్యాలు జరుపుకోవడానికి కమ్యూనిటీహాల్‌ను నిర్మించారు. నూతనంగా మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మిస్తామని చెప్పి కూల్చివేసి, నాలుగేళ్లు అవుతుంది. ఇంకెన్నాళ్లకు పూర్తి చేస్తారో తెలియదు. అర్ధంతరంగా నిలిపివేసిను పనులను ప్రారంభించి మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలి.

- చందర్ ముదిరాజ్, టీడీపీ నాయకుడు, అడ్డగుట్ట డివిజన్

త్వరగా పనులు పూర్తి చేయాలి



బీఆర్ఎస్ ప్రభుత్వంలో అడ్డగుట్ట డివిజన్‌లో ఎలాంటి అభివృద్ధి జరుగలేదు. అడ్డగుట్టలో నూతనంగా మల్టీపర్పస్ ఫంక్షన్‌హాలు నిర్మిస్తామని చెప్పి పాత కమ్యూనిటీహాలును కూల్చివేశారు. శుభకార్యాలయాలు జరుపుకునేందుకు అడ్డగుట్ట ప్రజలు ఇబ్బందులుపడుతున్నారు. ఎమ్మెల్యే పద్మారావు స్పందించి త్వరగా నిర్మాణ పనులను పూర్తి చేయాల్సిన అవసరం ఉంది.

- రామలీల, కాంగ్రెస్ పార్టీ నాయకురాలు, అడ్డగుట్ట

అందుబాటులోకి తేవాలి



అడ్డగుట్ట డివిజన్‌లో దాదాపు 65 వేల జనాభా ఉన్నది. వారిలో మధ్యతరగతి, పేద కుటుంబాలు అధికంగా ఉన్నాయి. ప్రైవేట్ ఫంక్షన్‌హాళ్లలో డబ్బు చెల్లించే శుభకార్యాలు జరుపుకునే స్థోమత వారికి లేదు. నాలుగేళ్ల నుంచి నిలిచిపోయిన నిర్మాణ పనులు ఎవరూ పట్టించుకోవడం లేదు. స్థానిక ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం చేయకుండా పనులు ప్రారంభించి మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌ను అందుబాటులోకి తేవాలి.

- సీహెచ్ కన్నాభిరాం, బీజేపీ మహాకాళీ జిల్లా కిసాన్‌మోర్చా అధ్యక్షుడు

అదనపు బడ్జెట్ కోసం జీహెచ్ఎంసీకి లేఖ



సికింద్రాబాద్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్లను అభివృద్ధి చేసుకుంటూ వస్తున్నాం. పెండింగ్ పనులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. అడ్డగుట్ట డివిజన్‌లో నిర్మించనున్న నూతన మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌కు అప్పట్లో రూ. 2.25 కోట్లతో పనులకు శంకుస్థాపన చేయగా, ఆ నిధులు సరిపోవడం లేదు. అదనంగా మరో రూ. 1.45 కోట్లు అవసరమున్నదని జీహెచ్ఎంసీకి లేఖ రాశాం. అదనపు బడ్జెట్ రాగానే ఈ నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తాం

ఎమ్మెల్యే పద్మారావు, సికింద్రాబాద్ ఎమ్మెల్యే



అధికారులకు సమస్యలను వివరిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

బండమైసమ్మనగర్ అభివృద్ధికి కృషి: తలసాని

పద్మారావునగర్, డిసెంబర్ 6(ఆంధ్రజ్యోతి): బండమైసమ్మ నగర్ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ స్పష్టం చేశారు. గురువారం వివిధ శాఖల అధికారులతో కలిసి బన్సీలాల్‌పేట్ డివిజన్‌లో ఎమ్మెల్యే పర్యటించారు. బండమైసమ్మనగర్‌లో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. దాదార రూ. 71లక్షలతో సీసీ రోడ్డు పనులు చేపట్టామని, పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించి వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జలమండలి, జీహెచ్ఎంసీ అధికారులు సమన్వయంతో పనిచేసి సీవరేజ్, వాటర్‌లైన్లకు సమస్యలు తలెత్తకుండా జాగ్రత్త వహించాలని అన్నారు. స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బస్తీని ఆనుకొని ఉన్న స్థలంలో వ్యర్థాలు వేయడంతో ఇబ్బందికరంగా ఉన్నదని స్థానికులు వివరించారు. స్పందించిన తలసాని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని వారికి హామీ ఇచ్చారు.



డీసీపీ రష్మీ పెరుమాళ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కాలనీ వాసులు

ప్రతీ బస్తీ, కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

బేగంపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నేరాలు, దొంగతనాల నివారణకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని నార్త్‌జోన్ డీసీపీ రష్మీ పెరుమాళ్ సూచించారు. బేగంపేట డివిజన్, మోతీలాల్ నెహ్రూనగర్, ఎస్‌బీఐ కాలనీల ఆసోసియేషన్ ఆధ్వర్యంలో నూతనంగా 27 సీసీ కెమెరాలను ఏర్పాటు చేయగా, ముఖ్యఅతిథిగా హాజరైన డీసీపీ ప్రారంభించారు. ప్రతి బస్తీ, కాలనీల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని డీపీపీ చెప్పారు. కాలనీ వాసులకు సీసీ కెమెరాల అవశ్యకతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏసీపీ గోపాలకృష్ణమూర్తి, ఇన్‌స్పెక్టర్ రామయ్య, కాలనీ ప్రతినిధులు విశాల్ సుధాం, రవీంద్ర జయశ్రీ, చంద్రశేఖర్, శ్రీశైలం తదితరుల పాల్గొన్నారు.



బహిరంగసభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ యూనియన్ నాయకులు

ఆటో, క్యాబ్, ట్యాక్సీ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలి

రెజిమెంటల్‌బజార్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆటో, క్యాబ్, ట్యాక్సీ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ నెల 7ఇందిరాపార్కు వద్ద జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బహిరంగసభకు సంబంధించిన పోస్టర్‌ను సికింద్రాబాద్ రేతిఫైల్ ఏఐటీయూసీ ఆటో స్టాండ్ వద్ద యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండీ ఉమర్‌ఖాన్, జాయింట్ సెక్రటరీ హరిదర్శన్ గురువారం అవిష్కరించారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి ఇందిరాపార్కు వరకు భారీ ర్యాలీ అనంతరం బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కృష్ణ, శ్రీనివాస్, అలీముద్దీన్, చంద్రశేఖర్ ,రాంబాబు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదులో టీడీపీ అడ్‌హక్ కమిటీ సభ్యుడు నర్సింగ్‌రావు తదితరులు

బొల్లారంలో టీడీపీ సభ్యత్వ నమోదు

తిరుమలగిరి డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మల్కాజ్‌గిరి పార్లమెంట్ సెగ్మెంట్ టీడీపీ అడ్‌హక్ కమిటీ సభ్యుడు జనగామ నర్సింగరావు ఆధ్వర్యంలో కంటోన్మెంట్ నియోజకవర్గం, బొల్లారంలో టీడీపీ సభ్యత్వ నమోదు గురువారం కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ పార్టీలకు చెందిన పలువురు కార్యకర్తలు టీడీపీ సభ్యత్వాలు స్వీకరించారు. కార్యక్రమంలో రాజేష్, ఫయాసుద్దీన్ ఖాన్, రాము, కిరణ్, కపిల్, జేబ్రాజ్, రాము తదితరులు పాల్గొన్నారు.



అశోక్‌నగర్‌లో పాదయాత్ర చేస్తున్న మాజీ కార్పొరేటర్ స్వరూపాగౌడ్

బౌద్ధనగర్ డివిజన్‌లో సమస్యలను పరిష్కరించండి

సికింద్రాబాద్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బౌద్ధనగర్ డివిజన్‌లో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని, వాటిని వెంటనే పరిష్కరించడానికి సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని మాజీ కార్పొరేటర్ స్వరూపాగౌడ్ అన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని పార్సీగుట్ట, అశోక్‌నగర్ ప్రాంతాల్లో ఆమె పాదయాత్ర చేశారు. అశోక్‌నగర్ బస్తీ ప్రధాన రహదారిలో రెండు నెలల క్రితం తాగునీటి పైప్ లైన్ రోడ్డు తవ్వి పైపులైన్లు వేసిన అధికారులు, గుంతులను పూడ్చకుండా వదిలేశారని అన్నారు. ఎగువ నుంచి వచ్చే నీటితో దిగువ ప్రాంతం బురదమయంగా మారిందని బస్తీ మహిళలు ఫిర్యాదు చేశారన్నారు. రెండు రోజుల్లో సమస్యను పరిష్కరించాలని జలమండలి జీఎంకు వినతిపత్రం అందజేసినట్టు ఆమె తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవిప్రసాద్ గౌడ్, అశోక్‌నగర్ బస్తీ కమిటీ అధ్యక్షుడు ఓంప్రకాశ్, నేతి సత్యనారాయణ, శ్యామ్ ముదిరాజ్, నారాయణ, శ్రీను, స్వామి, వెంకటేష్, షైఖిల్, శీను, బస్తీ మహిళలు పాల్గొన్నారు.

దివ్యాంగులకు పుస్తకాలు, పెన్నులు అందజేత

రాంగోపాల్‌పేట్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఏడాది ప్రజాపాలనను పురస్కరించుకుని సనత్‌నగర్ ఏ బ్లాక్ అధ్యక్షుడు త్రికాల మనోజ్ కుమార్ ముదిరాజ్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు పుస్తకాలను పంపిణీ చేశారు. గురువారం రాంగోపాల్‌పేట్ డివిజన్ పరిధిలోని మానసిక దివ్యాంగుల కేంద్రంలోని విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, పుస్తకాలు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో హేమంత్ సింగ్‌ఠాకూర్, నాగరాజు, వినోద్, పి.చందు, ఆవుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్రీడారంగాన్ని బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యం: శ్రీగణేష్

సికింద్రాబాద్/హైదరాబాద్ సిటీ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): క్రీడారంగాన్ని బలోపేతం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేసిందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా గురువారం జింఖానా గ్రౌండ్స్‌లో నిర్వహించిన 2 కే రన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడారంగాన్ని బలోపేతం చేయాలనే లక్ష్యంతో స్వయంగా ఫుట్‌బాల్ క్రీడాకారుడైన సీఎం రేవంత్‌రెడ్డి క్రీడలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులు మహమ్మద్ సిరాజ్, నిఖత్ జరీన్‌లకు సత్కారంతోపాటు ప్రభుత్వ ఉద్యోగం కాంగ్రెస్ ప్రభుత్వం కల్పించినదన్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించి రాష్ట్రానికి, దేశానికి పేరు తీసుకొని రావాలన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో అన్నివర్గాల ప్రజలు సంతోషంగా పాల్గొంటున్నారన్న ఎమ్మెల్యే, ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వామ్యం కావడం సంతోషకరమన్నారు. రైతులకు రుణమాఫీ, నిరుద్యోగ యువతకు ఉద్యోగకల్పనతోపాటు ఆరు గ్యారంటీలను అమలు చేస్తూ జనరంజకమైన పాలనను కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్నారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఉపసంచాలకులు జి.ఆశన్నా, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి సుధాకర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రమేష్, డీపీఆర్‌ఓ అబ్దుల్ కలీం, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



కంటోన్మెంట్‌లో జెండా ఊపి 2కే రన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

లాలమియా బస్తీలో బోర్‌వెల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

తిరుమలగిరి డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ వార్డ్-7 పరిధిలోని లాలమియా బస్తీలో గురువారం ఎమ్మెల్యే శ్రీగణేష్ పవర్ బోర్‌వెల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లాలమియా బస్తీలో నీటి ఎద్దడి లేకుండా చూస్తానని స్థానికులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

భవనంపై నుంచి పడి

కస్తూర్బా విద్యార్థినికి గాయాలు

- ఘటనపై అనుమానాలు



గాయపడిన విద్యార్థిని రేణుక

రామాయంపేట/అడ్డగుట్ట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కస్తూర్బా పాఠశాల భవనంపై నుంచి పడి విద్యార్థిని గాయాలైన సంఘటన మెదక్ జిల్లా రామాయంపేటలో జరిగింది. గురువారం ఈ ఘటన జరగగా, పాఠశాల సిబ్బంది విషయాన్ని బయటకు రానివ్వలేదు. మొదట చిన్న గాయమైనని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించారు. అయితే, విద్యార్థిని ఎముకలు విరినట్లు తెలియడంతో గురువారం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. దీంతో విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. రామాయంపేట వడ్డెర కాలనీకి చెందిన రేణుక కస్తూర్బా గాంధీ పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. కొన్ని రోజుల నుంచి ఆమె గైర్హాజరు కాగా, రెండు రోజుల క్రితమే పాఠశాలకు వెళ్లింది. బుధవారం సాయంత్రం పై అంతస్తుపై దుస్తులు ఆరేసేందుకు వెళ్లి.. మెట్లపై నుంచి పడి కింది అంతస్తు వరకు దొర్లుతూ వచ్చినట్లు పాఠశాల సిబ్బంది చెబుతున్నారు. గమనించిన వారు స్థానిక ఆస్పత్రిలో చికిత్స చేయించారు. గురువారం ఉదయం వరకూ విద్యార్థిని ఆరోగ్యం కుదుట పడకపోవడంతో గాంధీ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలిసి మెదక్ ఆర్డీవో రమాదేవి, తహసీల్దార్ రజనీలు గురువారం పాఠశాలకు వచ్చి విచారణ జరిపారు. ప్రిన్సిపాల్ విద్యార్థినితో పాటే ఆస్పత్రిలో ఉండటంతో పూర్తి వివరాలు తెలియరాలేదు.



అమ్మవారి కల్యాణం జరుపుతున్న వేదపండితులు

వైభవంగా రేణుకా ఎల్లమ్మ కల్యాణం

బౌద్ధనగర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రేణుకా ఎల్లమ్మ అమ్మవారి కల్యాణాన్ని వేదపండుతుల మంత్రోచ్చరణలో వైభవంగా నిర్వహించారు. సీతాఫల్‌మండి డివిజన్, బీదలబస్తీలోని రేణుకా ఎల్లమ్మ ఆలయ 16వ వార్షికోత్సవాలను గురువారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో వేదపండితుల మత్రోచ్చరణల నడుమ జమదగ్ని రేణుకా ఎల్లమ్మ కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా జరిపించారు. అమ్మవారి కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులకు ఆలయ కమిటీ నిర్వాహకులు అన్నప్రసాదం అందజేశారు. అనంతరం సాయంత్రం పురవీధులలో ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఊరేగించారు.

తెలంగాణ అస్తిత్వంపై సీఎం దాడి

తెలంగాణ తల్లి రూపం మార్చే ప్రయత్నం చేస్తే ఊరోక్కోం



గతంలో రూపొందించిన నమూనా చిత్రాలను ప్రదర్శిస్తున్న రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యులు

పంజాగుట్ట, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ అస్తిత్వంపై దాడి చేస్తున్నారని, రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్ ఆరోపించారు. తెలంగాణ తల్లి రూపం మార్చే ప్రయత్నం చేస్తే ఊరుకోబోమని ఆయన హెచ్చరించారు. తెలంగాణ తల్లి కిరీటం, బతుకమ్మ తీసేస్తామని అనడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు సీహెచ్.ఉపేంద్ర, ఎస్సీ కమిషన్ మాజీ సభ్యులు చిలకమర్తి నరసింహ, విద్యాసాగర్‌లతో కలిసి మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ అస్తిత్వంపై దాడిచేసి నాశనం చేస్తే ప్రయత్నం చేస్తున్నాడని, దీనిలో భాగంగానే తెలంగాణ తల్లి రూపాన్ని మార్చే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. సమైక్యవాదుల కనుసన్నల్లో ప్రజాపాలన చేస్తున్న సీఎం.. తెలంగాణ అస్తిత్వంపై జరిపే దాడిని ఖండిస్తున్నామన్నారు. మూడు కోట్లకు పైగా ఉన్న తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, అస్తిత్వానికి ప్రతి రూపమే తెలంగాణ తల్లి అన్నారు. ఉద్యమం నుంచి పుట్టిందే తెలంగాణ తల్లి అన్నారు. తెలంగాణ తల్లి రూపం మార్చే ప్రతిపాదనను విరమించుకోవాలన్నారు. క్యాబినెట్ మంత్రులకూ తెలియకుండా ఎందుకు రహస్యంగా విగ్రహం తయారు చేయిస్తున్నారని అన్నారు. తెలంగాణ తల్లి రూపం తెచ్చిన సమయంలో ప్రొఫెసర్ కోదండరామ్ కూడా ఉన్నారు. ఇప్పుడు మారుస్తామని చెప్తే ఎలా కోదండరామ్ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. చరిత్ర మీద అవగాహన లేకనే రేవంత్‌రెడ్డి రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు.

10న కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల ముట్టడి

బర్కత్‌పుర, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రూ.4 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఫీజులు విడుదల చేయాలని ఈనెల 10న రాష్ట్రవ్యాప్తంగా కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల ముట్టడి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బకాయిల విడుదలలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే ఫీజు పోరును ప్రజా ఉద్యమంగా మారుస్తామని ఆయన హెచ్చరించారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఫీజు ముట్టడి పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తివేసే కుట్ర జరుగుతుందన్నారు. విదేశీ విద్యా పథకం కింద రూ.20లక్షల స్కాలర్‌షిప్ మంజూరు చేసి, బీసీ కళాశాల హాస్టల్స్, గురుకుల పాఠశాలలకు సొంతభవనాలు నిర్మించాలన్నారు. బీసీ స్టడీసర్కిల్ బడ్జెట్‌ను రూ.200 కోట్లకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ నేతలు నీల వెంకటేష్, జి.మల్లేష్‌యాదవ్, సి.రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్. కృష్ణయ్య, బీసీ సంఘాల నాయకులు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చిన్మయ మిషన్ ప్రతినిధులు

బషీర్‌బాగ్ భారతీయ విద్యాభవన్‌లో

రేపు స్వామి స్వరూపానంద ప్రవచనాలు

బేగంపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 7న బషీర్‌బాగ్‌లోని భారతీయ విద్యాభవన్‌లో సాయంత్రం 6.30 నుంచి చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో ప్రవచనాలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను బేగంపేటలోని కార్యాయంలో మిషన్ ప్రతినిధులు రామచంద్రమూర్తి, రవీంద్రనాథ్, శివ గురువారం ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ చిన్మయ మిషన్ గ్లోబల్ హెడ్ స్వామి స్వరూపానంద ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రవచనాలను వినిపించనున్నట్లు తెలిపారు. అధ్యాత్మికం, ఆదర్శమైన ఉన్నత విలువలు తదితర విషయాలపై ప్రవచనాలను వినిపిస్తారన్నారు.



నల్ల రాధాకృష్ణ నుంచి అవార్డుకు సంబంధించిన పత్రాలను అందుకుంటున్న రాజేశ్వర్‌రావు

మానాల రాజేశ్వర్‌రావుకు డాక్టర్ అంబేడ్కర్ జాతీయ అవార్డు

రాంగోపాల్‌పేట్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాణిగంజ్‌కు చెందిన తెలంగాణ మాదిగ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు మానాల రాజేశ్వర్‌రావుకు బహుజన సాహిత్య అకాడమీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జాతీయ అవార్డును ప్రకటించింది. ఈ మేరకు గురువారం తమ కార్యాలయంలో బహుజన సాహిత్య అకాడమీ జాతయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ అవార్డుకు సంబంధించిన పత్రాలను రాజేశ్వర్‌రావుకు అందజేశారు. డిసెంబర్ 15న ఢిల్లీలో జరుగనున్న బహుజన సాహిత్య అకాడమీ జాతీయ సమావేశాలలో ప్రదానం చేయనున్నారు. 26 ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణ కోసం ఎన్నో పోరాటాలు చేసి కష్టనష్టాలను ఓర్చి దళిత జాతి హక్కుల కోసం పోరాడుతున్న తనను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేసినందుకు సంతోషం వ్యక్తం చేశారు.



ఫోరం చైర్‌పర్సన్‌కు ఫిర్యాదులను అందజేస్తున్న వినియోగదారులు

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

పద్మారావునగర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సమస్య పరిష్కార వేదికను సికింద్రాబాద్ సర్కిల్ ప్యారడైజ్ డివిజనల్ ఇంజనీర్ కార్యాలయం వద్ద ఫోరం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. సీజీఆర్ఎఫ్ మెంబర్ టెక్నికల్ కె.శోభారాణి, ఇండిపెండెంట్ మెంబర్ వి.అనిల్‌రెడ్డి పాల్గొని విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదులను స్వీకరించారు. ఫోరం చైర్‌పర్సన్ లలిత మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో అంతరాయం,హెచ్చు తగ్గులు, మీటర్లు, బిల్లుల సమస్యలు, ట్రాన్స్‌ఫారం, కేటగిరీ మార్పు, ఇతర విద్యుత్ సమస్యలకు సంబంధించిన సమస్యలపై వినియోగదారులు ఫిర్యాదు చేయవచ్చని అన్నారు. వినియోగదారులు పరిష్కారం లభించని ఫిర్యాదులపై తమ ఫోరంను సంప్రదించడం ద్వారా న్యాయ సహాయం పొందవచ్చని అన్నారు. వినియోగదారుల తమ ఫిర్యాదులను బిల్లును జతచేసి, వ్యక్తిగతంగా, లేదా ఆన్‌లైన్‌లో ఈమెయిల్, పోస్టులో పంపవచ్చన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ గోపయ్య, డీఈలు సీహెచ్ బ్రహ్మానందం, రమణారావు, ఏడీఈలు దుర్గాప్రసాద్, రమణయ్య, ఆదినారాయణ,ఏఈలు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి
ఎం.డి. రఫీక్ : 99854 00084, జి.అంజయ్య: 9985921364